'జగనన్న ఆరోగ్య సురక్ష' ఓ విప్లవం..

● ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

నెల్లిమర్ల రూరల్: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం చారిత్రాత్మకమని, ఆరోగ్యరంగంలో విప్లవాత్మకమైనదిగా నిలుస్తుందని ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పలనాయుడు, ఎమ్మెల్సీ డాక్టర్ పెనుమత్స సురేష్‌బాబు అన్నారు. మండలంలోని సారిపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష ప్రత్యేక మెడికల్ క్యాంప్‌ను శనివారం వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వైద్యులతో మాట్లాడి ఆరోగ్య సురక్ష ద్వారా అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ప్రతీ విభాగాన్ని క్షుణ్ణంగా పరిశీలించి రోగులతో మాట్లాడి వారి అభిప్రాయాలను సేకరించారు. అనంతరం ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స మాట్లాడుతూ... జగనన్న ఆరోగ్య సురక్షతో ప్రతి ఒక్కరికి ఆరోగ్యభరోసా లభిస్తుందన్నారు. ప్రజలందరూ ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం జగనన్న ఈ బృహత్తరమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని, నిపుణులైన వైద్యులతో మెడికల్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రస్తుత సమాజంలో మానవ జీవితానికి విద్య, వైద్యం అత్యంత కీలకంగా మారాయని, ఈ నేపథ్యంలోనే విద్య, వైద్య రంగానికి సీఎం అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని తెలిపారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఖరీదైన వైద్యాన్ని ఉచితంగా అందిస్తూ లక్షలాది మంది జీవితాల్లో వెలుగులు నింపుతున్నారని కొనియాడారు. అనంతరం రోగులకు మందుల కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ అంబళ్ల సుధారాణి, జెడ్పీటీసీ సభ్యుడు గదల సన్యాసినాయుడు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, మండల అధ్యక్షుడు చనమళ్లు వెంకటరమణ, సర్పంచ్ రాయి పైడమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి త్రివేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


నెల్లిమర్ల రూరల్: సారిపల్లిలో ఆరోగ్య సురక్ష మెడికల్ కిట్ అందజేస్తున్న ఎమ్మెల్యే బడ్డుకొండ, ఎమ్మెల్సీ పెనుమత్స

ప్రజారోగ్యమే మహాభాగ్యం..

విజయనగరం: ప్రజల ఆరోగ్యమే మహాభాగ్యంగా తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని విజయనగరం మున్సిపల్ కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ అన్నారు.

నగరంలోని 17వ డివిజన్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కమిషనర్ ఆర్. శ్రీరాములనాయుడు, అసిస్టెంట్ కమిషనర్ ప్రసాదరావుతో కలిసి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను ఆరా తీశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిలువ ఉన్న మందుల వివరాలను పరిశీలించారు. దాదాపు 170 రకాల మందులు అందుబాటులో ఉన్నట్లు గుర్తించారు. జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం ద్వారా నేత్ర పరీక్షలు చేసుకున్న వారికి కళ్లద్దాలను ఉచితంగా అందజేసారు. ఈ సందర్భంగా ఫ్లోర్‌లీడర్ ఎస్‌వీవీ రాజేష్ మాట్లాడుతూ, నగరంలో ఇప్పటివరకు 12 ప్రాంతాలలో జగనన్న ఆరోగ్య సురక్ష కేంద్రాలు పూర్తయ్యాయని, తమ డివిజనల్ ప్రాంతంలో 13వ శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ఇంతవరకు జరిగిన కార్యక్రమం ద్వారా దాదాపు 8,500 మంది వైద్య సేవలు పొందారని తెలిపారు. సుమారు 120 మందిని మెరుగైన వైద్యం కోసం ఆరోగ్యశ్రీ కింద రిఫరల్ ఆస్పత్రులకు పంపించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజారోగ్య అధికారి కొండపల్లి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


విజయనగరం: రోగికి హెల్త్‌ఫైల్ అందజేస్తున్న ఫ్లోర్ లీడర్ రాజేష్, తదితరులు

క్లుప్తంగా

బీవైవీ ప్రీమియర్ లీగ్ వాల్‌పోస్టర్ల ఆవిష్కరణ


వాల్‌పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కోలగట్ల, తదితరులు

విజయనగరం: వచ్చే నెల 14న జరగనున్న బిజినెస్ యూత్ ఆఫ్ విజయనగరం (బీవైవీ) ప్రీమియర్ లీగ్ సీజన్ – 2కు సంబంధించిన వాల్‌పోస్టర్లను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి శనివారం ఆవిష్కరించారు. రామనారాయణం రోడ్డులోని గ్రోవ్ స్పోర్ట్స్ పార్క్ వేదికగా ఆ రోజున జరిగే క్రికెట్ లీగ్ ద్వారా వచ్చిన మొత్తాన్ని సేవా కార్యక్రమాలకు, ప్రభుత్వ పాఠశాలల్లో అదనపు తరగతి గదుల నిర్మాణానికి వెచ్చించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర పారిశ్రామిక అభివృద్ధి మండలి డైరెక్టర్ సంగంరెడ్డి బంగారునాయుడు, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్‌కౌశిక్, కార్పొరేటర్లు అల్లు చాణక్య, బండారు ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ముఖద్వారం ప్రారంభం


ఆలయ ముఖద్వారం వద్ద పూజలు చేస్తున్న కోలగట్ల కృష్ణారావు

విజయనగరం: పట్టణంలోని ఎనిమిదో డివిజన్ పరిధిలోగల అయ్యకోనేరు దక్షిణ గట్టులో నిర్మించిన ఉమామహేశ్వర ఆలయ ముఖద్వారాన్ని వైఎస్సార్‌సీపీ జోనల్ ఇన్‌చార్జ్ కోలగట్ల కృష్ణారావు శనివారం ప్రారంభించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు అయ్యగారి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అర్చకులు శ్రీనివాసశర్మ, సందీప్, తదితరులు కోలగట్లకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ, హైందవ సంప్రదాయ పరిరక్షణలో భాగంగా భారీ ముఖద్వారం ఏర్పాటు చేయడం శుభపరిణామమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆదిభట్ల ఆనంద్‌నారాయణదాసు, జె. కనకారావు, గూడూరు రామకృష్ణ, పి. రామారావు, మహిళా కార్యకర్తలు సరోజినీ, గౌరి, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

సీపీ ఆక్వా పరిశ్రమ తెరిపించాలి


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీఐటీయూ నాయకులు

పూసపాటిరేగ: సీపీ ఆక్వా పరిశ్రమ తెరిపించి కార్మికులకు ఉపాధి కల్పించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి టీవీ రమణ డిమాండ్ చేశారు. శనివారం స్థానిక రాజావీధిలో ఏర్పాటు చేసిన సమావేశంలో డిమాండ్లపై రూపొందించిన వాల్‌పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్న కార్మికులకు శ్రమకు తగిన వేతనం ఇవ్వాలన్నారు. తక్షణమే పరిశ్రమ తెరిపించడానికి యాజమాన్యం చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో సీటీయూ జిల్లా కార్యవర్గ సభ్యుడు బి. సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లలితా త్రిపుర సుందరిదేవిగా దుర్గమ్మ


లలితా త్రిపుర సుందరిదేవి అలంకరణలో దుర్గమ్మ

విజయనగరం టౌన్: రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారి ఆలయంలో కొలువైన దుర్గాదేవి శనివారం లలితా త్రిపుర సుందరీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేదపండితుడు వెలువలపల్లి నరసింహమూర్తి అమ్మవారికి వేకువజామునుంచి పంచామృతాలతో అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం శ్రీచక్ర కుంకుమార్చనలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించి తరించారు.

కళాకారులకు రూ. పది వేల పెన్షన్ ఇవ్వాలి

● సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కామేశ్వరరావు

విజయనగరం పూల్‌బాగ్: కళాకారులకు నెలకి రూ.10 వేల పెన్షన్ ఇచ్చి ఆదుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పి. కామేశ్వరరావు డిమాండ్ చేశారు. విప్లవ సినీ దర్శకుడు, అమరజీవి కామ్రేడ్ టి. కృష్ణ 36వ వర్ధంతి సభ శనివారం స్థానిక అమర్‌భవన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా గౌరవాధ్యక్షుడు బుగత అశోక్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, టి. కృష్ణ వామపక్ష, విద్యార్థి, యువజనోద్యమాల పట్ల ఆకర్షితుడై ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేవారన్నారు. అనేక నాటకాల్లో నటించి దర్శకత్వం వహించారని తెలిపారు. వామపక్ష, అభ్యుదయ భావాలతో సినీ రంగానికి విశిష్ట సేవలు అందించడంతో పాటు రాజశేఖర్, విజయశాంతి వంటి ఎంతోమంది నటీనటులను, వందేమాతరం శ్రీనివాస్ వంటి సంగీత దర్శకుడ్ని పరిచయం చేశారని గుర్తు చేశారు. అలాగే సామాజిక సమస్యలు ప్రతిబింబించ కథలతో ఈతరం ఫిలిమ్స్ బ్యానర్‌లో ఎన్నో సినిమాలు తీశారని చెప్పారు. ఆయన వర్ధంతి సందర్భంగా జిల్లాలో గురజాడ కళాక్షేత్రం ఏర్పాటు చేసి అంతరించిపోతున్న కళలను ప్రోత్సహించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మన్యం జిల్లా సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి టి.జీవన్, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షుడు కాళ్ల కృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి టి. రాము, ఎస్.రంగరాజు, బాయి రమణమ్మ, బుగత పావని, ఎన్. నాగభూషణం, బూర వాసు, తదితరులు పాల్గొన్నారు.


టి. కృష్ణ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ప్రజా నాట్యమండలి సభ్యులు

శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించండి

విజయనగరం పూల్‌బాగ్: ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలో పనిచేస్తున్న శానిటేషన్ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని వర్కర్ల యూనియన్ జిల్లా నాయకురాలు బి.సుధారాణి డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నవంబర్ 5న ఎన్‌పీఆర్ శ్రామిక భవనంలో ప్రత్యేక సదస్సు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వర్కర్లతో ఫుల్ టైమ్ పని చేయించుకుని.. పార్ట్ టైమ్ వేతనాలు చెల్లిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. స్కూల్ ఆయాలకు కనీసం రూ.10 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్సై, పీఎఫ్, వీక్లీ ఆఫ్, తదితర సౌకర్యాలు కల్పించాలని.. ప్రతినెలా జీతాలు చెల్లించాలని.. పనిభారం తగ్గించాలని.. యూనిఫాం, మాస్కులు, గ్లౌజులు ఇవ్వాలని కోరారు. సమస్యలను పరిష్కరించాలని కోరుతూ చేపట్టనున్న సదస్సును శానిటేషన్ వర్కర్లు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు ఎ. జగన్‌మోహన్, బి.రమణ, స్కూల్ ఆయాలు సత్తమ్మ, లక్ష్మి, అంజలి, లతా, ఆదిలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.


సదస్సు వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న యూనియన్ నాయకులు

రక్తదానం మహోన్నతమైన సేవ

● ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం ఫోర్ట్: రక్తదానం మహోన్నతమైన సేవ అని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. జాతీయ స్వచ్ఛంద రక్తదాన మాసోత్సవం సందర్భంగా న్యూలైఫ్ బ్లడ్ బ్యాంక్‌లో ఏపీజే అబ్దుల్ కలామ్ బ్లడ్ డోనర్స్ క్లబ్, గాంధీ బ్లడ్ డోనర్స్ క్లబ్ సంయుక్తంగా నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, రక్తదాతలే ప్రాణదాతలని తెలిపారు. మనిషి మాత్రమే ఆపదలో ఉన్న సాటిమనిషికి రక్తం ఇచ్చి ప్రాణాలు కాపాడగలడన్నారు. ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ ఏడాదికి నాలుగు సార్లు రక్తదానం చేయవచ్చని తెలిపారు. రక్తదాన శిబిరాలు నిర్వహించడంలో స్వచ్ఛంద సంస్థల పాత్ర అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అబ్దుల్ రవూఫ్, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.


రక్తదానం చేస్తున్న రక్తదాతలు

గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

● ఎంపీపీ అంబళ్ల సుధారాణి

నెల్లిమర్ల రూరల్: గర్భిణుల ఆరోగ్యంపై అంగన్‌వాడీ, వైద్య, ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఎంపీపీ అంబళ్ల సుధారాణి సూచించారు. మండలంలోని సారిపల్లిలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పౌష్టికాహార ప్రదర్శనను శనివారం ఆమె తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు మెరుగైన పౌష్టికాహారం అందించాలనే ఏకైక లక్ష్యంతో సీఎం జగనన్న అదనంగా నిధులు మంజూరు చేస్తున్నారన్నారు. గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు రక్తహీనత రాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందని సూచించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి అంబళ్ల శ్రీరాములనాయుడు, కార్యక్రమంలో సర్పంచ్ రాయి పైడమ్మ, ఎంపీటీసీ సభ్యురాలు మజ్జి త్రివేణి, గ్రామ పెద్దలు విభీషణరావు, గుర్నాథరావు, ఆనంద్, సూపర్‌వైజర్ ఆల్తి జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి నాగార్జునకు సన్మానం


విజయనగరం రూరల్: మంత్రి మేరుగ నాగార్జునను సత్కరిస్తున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం రూరల్/నెల్లిమర్ల: జిల్లాకు విచ్చేసిన రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖా మంత్రి మేరుగ నాగార్జునను జిల్లా పరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు శనివారం సత్కరించారు. జెడ్పీ అతిథి గృహానికి విచ్చేసిన మంత్రి నాగార్జునకు జెడ్పీ చైర్మన్ స్వాగతం పలికి, అనంతరం శాలువతో సత్కరించి, పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే నెల్లిమర్లలోని రెవెన్యూ కల్యాణ మంటపంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న మంత్రి నాగార్జునను నెల్లిమర్ల నగర పంచాయతీ చైర్‌పర్సన్ బంగారు సరోజిని, పార్టీ నాయకుడు శంకరరావు మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.


నెల్లిమర్ల: మంత్రి నాగార్జునకు సత్కరిస్తున్న చైర్‌పర్సన్ బంగారు సరోజిని, శంకరరావు

సమావేశాలకు అధికారులు హాజరుకావాల్సిందే..


అధికారులను ప్రశ్నిస్తున్న ఎంపీపీ అప్పలనాయుడు

● ఎంపీపీ మామిడి అప్పలనాయుడు

విజయనగరం రూరల్: ప్రజా సమస్యల పరిష్కారానికే మండల సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తున్నామని.. ఈ సమావేశాలకు అధికారులు తప్పనిసరిగా హాజరు కావాల్సిందేనని విజయనగరం ఎంపీపీ మామిడి అప్పలనాయుడు అన్నారు. విజయనగరం మండల పరిషత్ సమావేశ మందిరంలో ఎంపీపీ అప్పలనాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సమావేశం ప్రారంభం నుంచి వాడీవేడిగా సాగింది. ముఖ్యంగా అధికారులు వారి ప్రగతి నివేదికలతో సమావేశాలకు హాజరుకాగా.. సభ్యులు పలు సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చారు. గత సమావేశాలకు తహసీల్దార్ హాజరుకాకపోవడంపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేయడమే కాకుండా, ఇతర అంశాలపై వారివురి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. పాలనాపరమైన అంశాలను అమలు చేయడమే అధికారుల బాధ్యతని, పరిధి దాటి నిర్ణయాలు తీసుకోవడం సరికాదని ఎంపీపీ అన్నారు. తెలుగుదేశం పార్టీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు, ఆ పార్టీ మద్దతు సర్పంచ్ అభ్యర్థులు ఆ పార్టీ అధినేత చంద్రబాబునాయుడు అరెస్ట్‌కు నిరసనగా సభ నుంచి వాకౌట్ చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు కర్రోతు నారాయణ, కొనర నిర్మల, ఎంపీడీఓ గంటా వెంకటరావు, తహసీల్దార్ కోరాడ శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల శాఖ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

అదనపు పరిహారం ఇవ్వాలి


కలెక్టర్‌ను కలిసిన మెంటాడ గ్రామస్తులు

విజయనగరం అర్బన్: జిల్లా మీదుగా చేపట్టదలచిన గ్రీన్‌ఫీల్డ్ రహదారి నిర్మాణం నిమిత్తం సేకరించిన భూములకు సంబంధించి, అదనపు పరిహారం ఇవ్వాలని మెంటాడ గ్రామ రైతులు డిమాండ్ చేశారు. ఇదే విషయమై వారంతా జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ నాగలక్ష్మిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రహదారి నిర్మాణం కోసం గ్రామంలోని పలువురు రైతులు తమ 123 ఎకరాల పంటభూమి కోల్పోయారన్నారు. అప్పట్లో సెంటు భూమికి రూ.11 వేలు మాత్రమే పరిహారంగా చెల్లించారని, అదనంగా మరో రూ.3 వేలు పరిహారం ఇస్తామన్నారన్న విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. దీనిపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారన్నారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో గ్రామ సర్పంచ్ రేగిడి రాంబాబు, ఎంపీటీసీ పి.కుమారి, మాజీ సర్పంచ్ పాండ్రంగి సన్యాసిరావు తదితరులు ఉన్నారు.

పెండింగ్ బకాయిలు చెల్లించాలి

విజయనగరం అర్బన్: ఉద్యోగులకు పెండింగ్ బకాయిలను చెల్లించాలని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్టీయూ) జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం స్థానిక కలెక్టరేట్ ఎదుట ఆక్రందన దీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఉద్యోగులకు జీతాలను సకాలంలో ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అవసరానికి ఇవ్వాల్సిన బిల్లులు కూడా పెండింగ్ పెడుతోందని వాపోయారు. అనంతరం డీఆర్‌ఓ డీఎస్ అనితను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆక్రందన దీక్షకు యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జేఏవీఆర్‌కే ఈశ్వరరావు మద్దతు పలికారు. ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు వై.అప్పారావు, ప్రధాన కార్యదర్శి డి.శ్యామ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.జోగారావు, జిల్లా కార్యవర్గ సభ్యులు సీహెచ్ సూరిబాబు, వి.గోవిందరావు, రాష్ట్ర కౌన్సిలర్ రవి, రమణ, రాంబాబు, రామచంద్ర, రమణ, శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.


డీఆర్‌ఓ అనితకు వినతిపత్రం అందజేస్తున్న ఎస్టీయూ ప్రతినిధులు

పైడితల్లిని దర్శించుకున్న డిప్యూటీ మేయర్

విజయనగరం: విజయనగరం ప్రజల ఆరాధ్యదైవం పైడితల్లి అమ్మవారిని నగర డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఈశ్వర్ కౌశిక్ దంపతులు శనివారం కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అంతకుముందు అర్చకులు వారిని ఆలయ సంప్రదాయ ప్రకారం ఆహ్వానించారు. పైడిమాంబ ఆశీస్సులు ప్రజలందరిపైనా ఉండాలని డిప్యూటీ మేయర్ శ్రావణి ఆకాంక్షించారు.

ఇసుక వాహనాల పట్టివేత

నెల్లిమర్ల: అక్రమంగా ఇసుక తరలిస్తున్న వాహనాలను ఎస్ఈబీ అధికారులు పట్టుకున్నారు. డిస్ట్రిక్ట్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు కొండవెలగాడ జంక్షన్, చంపావతి నది, మొయిద జంక్షన్లలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ఎస్.రాజశేఖర్ నాయుడు ఆధ్వర్యంలో సబ్‌ఇన్‌స్పెక్టర్ పి.నాగలక్ష్మి, డి.టి.ఎఫ్ సీఐ రాజేశ్వరి, స్థానిక ఎస్ఐ పి.నారాయణరావు శనివారం వాహన తనిఖీలు చేసి, మూడు ఇసుక లారీలు, ఒక ఇసుక ట్రాక్టరును పట్టుకుని, సీజ్ చేసి నెల్లిమర్ల పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మొత్తం 34.5 టన్నుల ఇసుక స్వాధీనం చేసుకున్నామని, నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేశామని నెల్లిమర్ల స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రాజశేఖర్‌నాయుడు తెలిపారు. అక్రమంగా ఇసుక తవ్వకాలు జరిపినా, తరలించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


పట్టుకున్న ఇసుక ట్రాక్టరు వద్ద ఎస్ఈబీ అధికారులు

దుర్గమ్మకు సారె సమర్పణ

విజయనగరం టౌన్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా స్థానిక 38వ డివిజన్ కొత్త దుప్పాడలో కొలువైన దుర్గమ్మకు శనివారం సారె సమర్పించారు. సాయంత్రం జరిగిన ఈ కార్యక్రమంలో అమ్మవారి మండపం నుంచి సారెను వీధుల్లో ఊరేగించారు. అనంతరం భక్తులకు వాటిని పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా చేపట్టిన కోలాటం, తీన్మార్ డప్పుల ప్రదర్శన ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో కార్పొరేటర్ టి.సంధ్యారాణి, ఉత్సవ కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.


అమ్మవారికి భక్తులు సమర్పించిన సారె సామగ్రి

భగవాన్‌దాస్‌కు నివాళులు

విజయనగరం: కబడ్డీ, ఖోఖో క్రీడా పితామహుడు స్వర్గీయ భగవాన్ దాస్ మాస్టర్‌కు క్రీడాకారులు నివాళులర్పించారు. శనివారం స్థానిక కస్పా హైస్కూల్‌లో భగవాన్‌దాస్ వర్ధంతి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ద్రోణాచార్య అవార్డుగ్రహీత ఇజ్జపురెడ్డి ప్రసాదరావు, భగవాన్ దాస్ మెమోరియల్ ట్రస్ట్ కార్యదర్శి రంగారావు దొర, రమణమూర్తి, ఖోఖో చైర్మన్ చిన్నంనాయుడు, కార్యదర్శి సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ బొమ్మన రామారావు, ఏఎస్ఎం కమలనాభరావు, నాయుడు, అప్పన్న, కృష్ణ, తవుడు, ఎన్. లక్ష్మణరావు, వర్మ, అచ్చుతరావు, గోవింద్, తదితరులు పాల్గొన్నారు.


స్వర్గీయ భగవాన్‌దాస్ మాస్టర్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం